లోన్ యాప్‌లతో మోసం

- తొమ్మిది మంది నిందితుల అరెస్టు
- రూ.60 లక్షల క్రిప్టో కరెన్సీ ఫ్రీజ్
- వివరాలు వెల్లడించిన సీపీ శంఖబ్రత బాగ్చి



- వార్త మెయిన్ 3లో

ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

ఒకరికి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, ముగ్గురికి సూపరింటెండెంట్లుగా పోస్టింగ్స్

- ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవికి పూర్తి బాధ్యతలు
- భర్తీకాని కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టు



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని వివిధ విభాగాల వైద్యులకు పదోన్నతులు లభించాయి. వివిధ జిల్లాల్లోని కాలేజీలకు ప్రిన్సిపాల్స్‌గా, ఆస్పత్రులకు సూపరింటెండెంట్లుగా నియమించారు. వీరిలో గైనకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కేవీఎస్ఎం సంధ్యాదేవిని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన బుచ్చిరాజు గత నెలలో పదవీ విరమణ చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి వ్యవహరిస్తున్నారు. ఆమెకే పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించారు. ఎండో క్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యంను ఒంగోలు లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. గైనకాలజీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సి.అమూల్యను శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. జనరల్ సర్జరీ విభాగాని కి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మథరావును మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిం టెండెంట్‌గా నియ మించారు వీరిలో ఇద్దరు వైద్యులు ఆయా పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి చూపడంలేదని సమాచారం.

కేజీహెచ్‌పై సందిగ్ధం

కాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టు ను ప్రభుత్వం భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నారు. తాజాగా పదోన్నతులు పొందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు సీనియర్ వైద్యులు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగించారు. అయితే వారికి మరో చోట అవకాశాలు లభించాయి.

నేడే మేయర్ ఎన్నిక

ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నిక లాంఛనమే
- అనంతరం బాధ్యతల స్వీకరణ





పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): **జీవీఎంసీ నూతన మేయర్ ఎన్నిక సోమవారం జరగనున్నది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన మేయర్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకోసం జీవీఎంసీ పరిధిలోని 97 మంది కార్పొరేటర్లతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుల హోదాలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ముగ్గురు ఎమ్మెల్సీలకు ముందస్తు సమాచారం అందజేశారు.**

పీలా ఎన్నిక లాంఛనమే...

జీవీఎంసీ మేయర్‌గా 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు పేరు ఖరారయింది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదివారం బీఫాం అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనమేనని కూటమి నేతలు చెబుతున్నారు. ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. సమావేశం ప్రారంభం కాగానే మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరుని ఒక కార్పొరేటర్ ప్రతిపాదిస్తారు. దానిని కూటమి భాగస్వామ్యపార్టీకి చెందిన మరో కార్పొరేటర్ బలపరుస్తారు. దీనిపై ఎన్నికల అధికారి హోదాలో జేసీ మయూర్ అశోక్ ఓటింగ్ నిర్వహిస్తారు. జీవీఎంసీలో కూటమికి 63 మంది కార్పొరేటర్లతో పాటు 11 మంది ఎక్స్ అఫీషియోసభ్యుల బలం ఉంది. మేయర్ ఎన్నికకు జీవీఎంసీ మొత్తం సభ్యుల్లో సగం మంది మద్దతు ఉంటే సరిపోతుంది ఈ నేపథ్యంలో పీలా శ్రీనివాసరావు ఎన్నిక లాంఛనమే. మేయర్‌గా ఎన్నికైన వెంటనే పీలా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించేందుకు నిర్ణయించుకోవడంతో అతని ప్రమాణ స్వీకారానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఇదిలావుండగా మేయర్ ఎన్నిక ప్రక్రియను బహిష్కరిస్తున్నట్టు వైసీపీ కార్పొరేటర్లు ప్రకటించారు.

విశాఖ అభివృద్ధి కోసమే మేయరు మార్పు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



పీలా శ్రీనివాసరావుకు బి.ఫాం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర అభివృద్ధి కోసమే జీవీఎంసీ మేయరును మార్చుతున్నామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు మేయరు అభ్యర్థిగా ఎంపికైన పీలా శ్రీనివాసరావుకు ఆదివారం పార్టీ కార్యాలయంలో బీఫాం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అథోగతిపాలైతే జీవీఎంసీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి పాలనలో విశాఖను మరింత అభివృద్ధి చేయాలనే దృక్పథంతో మేయరును మార్చాలని నిర్ణయించామన్నారు. బీఫాంతోపాటు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సిన ఫాం-ఎ కూడా పీలాకు అందజేశారు. ఉదయం తొమ్మిది గంటలకు జీవీఎంసీలో కూటమి కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియోసభ్యులు సమావేశమై మేయరు అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ఎన్నుకుంటారన్నారు. ఆ తరువాత ప్రిసైడింగ్ అధికారి మేయరు ఎన్నిక ప్రక్రియను ప్రారంభించి, నామినేషన్లు స్వీకరించిన అనంతరం ఎన్నిక నిర్వహిస్తారన్నారు.

భూ సమీకరణలో అక్రమాలు

విజిలెన్స్ విచారణలో వెలుగులోకి

- పేదలకు ఇళ్ల కోసం జెర్రిపోతులపాలెంలో 64.63 ఎకరాలు సమీకరించిన వైసీపీ ప్రభుత్వం
- భూమి లేని వారికి 10 వేల గజాల కేటాయింపు
- ఆ మొత్తం విలువ రూ.25 కోట్లు పైమాటే
- అక్రమాల్లో పెందుర్తి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాత్ర



పేదల ఇళ్ల కోసం సమీకరించిన భూమి

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): **గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం కోసం చేపట్టిన భూ సమీకరణపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణలో అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో భూ సమీకరణ పేరిట రూ.25 కోట్ల కుంభకోణం జరిగినట్లు సమాచారం. అసలు భూములే లేని వారిని బినామీలుగా చూపించి, వారికి పది వేల గజాలు కేటాయించినట్టు వచ్చిన ఫిర్యాదులపై విచారణకు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయ అధికారులు వెనుకంజవేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.**

ఇళ్ల నిర్మాణం కోసం జెర్రిపోతులపాలెంలో మొత్తం 64.63 ఎకరాలను సుమారు 50 మందికి పైగా రైతుల నుంచి సమీకరించారు. డీపట్టా ఉంటే 900 గజాలు, డీపట్టా లేకుండా భూమి ఆధీనంలో ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో నమోదైతే 450 గజాల చొప్పున ప్లాట్లు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. భూములు ఇచ్చిన రైతులకు గ్రామ సమీపంలో గల కొండకు ఆనుకుని ప్లాట్లు అభివృద్ధి చేసి అందించారు. మొత్తం 65 మందికి 5,444.5 గజాలు కేటాయించారు. కాగా కొందరు స్థానిక వైసీపీ నేతలు, అప్పటి పెందుర్తి తహసీల్దారు, సిబ్బంది ఏకమై 15 మంది బినామీల పేర్లు నమోదుచేశారు. వీరి పేరిట సుమారు 10 వేల గజాల ప్లాట్లు కేటాయించారు. వాస్తవంగా రైతుల నుంచి సమీకరించిన భూమికి ప్లాట్లు కేటాయించలేదు. ఆక్రమిత భూమికి ఎకరాకు 450 గజాల చొప్పున రైతులకు అందాలి. కానీ కొందరికి చాలా తక్కువ ఇచ్చారు.

గత ప్రభుత్వ పెద్దల దన్నుతో గ్రామంలోని ఓ వైసీపీ నేత తనకు వచ్చే వాటా కంటే ఐదింతలు ప్లాట్లు తీసుకున్నారు. అతని సతీమణి, అత్త, బావమరిది, మరదలు, తోడల్లుడు ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసుల తనిఖీ



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న టూ టౌన్ సీఐ ఎర్రన్నాయుడు, ఎస్ఐలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. రైల్వే స్టేషన్, ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్స్‌లో ఆదివారం విస్తృత సోదాలు నిర్వహించారు. టౌ టూన్ సీఐ ఎర్రన్నాయుడు ఆర్టీసీ కాంప్లెక్స్, ఎల్ఐసీ రోడ్డు, డీఆర్ఎం కార్యాలయం తదితర ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లు, కారు డిక్కీలు పరిశీలించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి గస్తీతో పాటు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు ప్రజలు, ఎస్ఐలు సతీష్, మన్మథరావు, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్, ఎం ఫార్మా పీజీ కోర్సులకు 7 వేల దరఖాస్తులు

ఈనెల 30 వరకు అవకాశం

- జూన్ 6 నుంచి 8 వరకు ప్రవేశ పరీక్ష

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్, ఎం ఫార్మా పీజీ కోర్సులకు సుమారు ఏడు వేల దరఖాస్తులు అందాయి. గత ఏడాది సుమారు 11 వేల మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. మరో మూడు రోజులు గడువు ఉండడంతో అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 28న ఏపీ పీజీఈసెట్ నోటిఫికేషన్ విడులైంది. ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఇంజనీరింగ్ 12 బ్రాంచుల్లో ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు చేపట్టనున్నారు. వీటిలో బయోటెక్నాలజీ, కెమి కల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎల క్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, జియో ఇంజనీరింగ్ అండ్ ... మిగతా 6వ పేజీలో

చర్చిలో బాలిక మృతిపై అనుమానాలు

ఏం జరిగిందో పోలీసులకూ స్పష్టత కరవు

- తాజాగా శ్రీకాకుళంలో బాలిక తల్లి, అమ్మమ్మ ఆత్మహత్య
- వారి మానసిక పరిస్థితి బాగా లేదని స్థానికుల అనుమానం



ఆత్మహత్య చేసుకున్న పూర్ణ చంద్రిక అమ్మమ్మ సావిత్రమ్మ, అమ్మ వరలక్ష్మి (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): **జ్ఞానాపురంలోని పునీత పేతురు చర్చిలో విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన ఈదల పూర్ణచంద్రిక (11) మృతిపై అనుమానాలు తొలగకుండానే బాలిక తల్లి, అమ్మమ్మ ఆత్మహత్యకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. అసలు బాలిక ఎలా మృతిచెందిందో తేలకముందే వారిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో ఏం జరిగిందో నిగ్గుతేల్చే పనిలో పోలీసులు పడ్డారు.**

శ్రీకాకుళం మండలం గూడెం గ్రామానికి చెందిన మోది సావిత్రమ్మ తన కుమార్తె వరలక్ష్మితో కలిసి 15 ఏళ్ల కిందటే డెంకాడకు వలస వెళ్లిపోయింది. 12 ఏళ్ల కిందట వరలక్ష్మికి ఈదల శ్రీనివాసరావు అనే వ్యక్తితో వివాహమయింది. వారికి పూర్ణచంద్రిక జన్మించింది. దంపతుల మధ్య వివాదాల కారణంగా వరలక్ష్మి తన కుమార్తెతో కలిసి తల్లి సావిత్రమ్మ వద్ద ... మిగతా 6వ పేజీలో

పాలీసెట్‌కు ఆరు కేంద్రాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30న జరిగే పరీక్షకు పట్టణంలో ఆరు కేంద్రాలను కేటాయించినట్టు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 216 మంది, జూనియర్ కళాశాలలో 240, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 144, గొల్లల పాలెం సీడర్ హైస్కూల్‌లో 192, భీమిలి సీడర్ ప్రాథమిక పాఠశాలలో 192 మంది, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 160 మంది పరీక్ష రాయనున్నట్టు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఫీజు చెల్లింపు ఫెయిలై, హాల్ టికెట్ పొందలేని వారు దరఖాస్తు, రెండు ఫొటోలు, ఆధార్, టెన్త్ హాల్ టికెట్, ఫీజు తీసుకుని తమ కళాశాలలో సంప్రతించాలని సూచించారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వితంతువులు కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎం. విజయకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీలోపు భర్త చనిపోయిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులని చెప్పారు.

'ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలి'

మధురవాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీ, పాత మధురవాడ మెట్ట, పోర్టు కాలనీ, వాంబే కాలనీ, అయోధ్యనగర్‌లో బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఏడాది మార్చి నెలలోనే ఎండలు మండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల బోరు బావుల ద్వారా చుక్క నీరు కూడా రావడం లేదు. ఈనేపథ్యంలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తాళ్లవలస పంచాయతీ గొల్లలతాళ్లవలస గ్రామానికి చెందిన గొర్రెల కాపరి లొడగల పాపయ్య (42) ఈనెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన భార్య బంగారమ్మ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను సంగివలస ఎన్ఆర్ఐ కళాశాలలో పని చేస్తున్నానని ఈనెల 25న విధుల నుంచి ఇంటి రాగానే భర్త కనిపించలేదని తెలిపారు. బంధువుల ఇళ్లతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదన్నారు. సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

తగరపువలస, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసకు చెందిన టీడీపీ నాయకుడు రవ్వ వెంకట్రావు వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు పేదలకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ చేతుల మీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పల రమేశ్, తమ్మిన సూరిబాబు, దొంతల పైడిరాజు, కొప్పల కృష్ణ, కోసూరి రాంబాబు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరగనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చర్మ వ్యాధుల పట్ల అప్రమత్తం

ఎండాడ/సాగర్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : డెర్మటాలజీలో లేజర్ల వినియోగంపై వైద్యులకు అవగాహన అవసరమని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. ఆదివారం జిమ్సర్‌లో 'వేవ్స్ అండ్ వేవ్ లెంథ్స్' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ వెనిరీలాజిస్ట్స్ అండ్ లెప్రాలజిస్ట్స్ (ఐవీడీపీఎల్) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మధురైకి చెందిన ప్రముఖ లేజర్ వైద్య నిపుణుడు డాక్టర్ అవిటస్ జాన్ రాకేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమీకరణలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

పేరిట అక్రమాలు సాగాయి. వాస్తవంగా వీరికి భూములు లేకపోయినా బినామీలుగా జాబితాలో చోటు సంపాదించారు. పెందుర్తి తహసీల్దారు కార్యాలయం కేంద్రంగా రికార్డులు మార్చేశారు. ఇదిలా ఉండగా జెర్రిపోతుల పాలెం భూ సమీకరణపై జరుగుతున్న విచారణను పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చందనోత్సవం విజయవంతానికి కృషి

- అంతరాలయ దర్శనాలు ఆరు గంటలతో పూర్తి
- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత
- సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలన


మంత్రి అనితకు ఏర్పాట్లు గురించి వివరిస్తున్న ఈఓ సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం విజయవంతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం ఆమె కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి, దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారి నిజరూప దర్శనం భక్తులందరికీ కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈఏడాది సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాధారణ భక్తులతో సంబంధం లేకుండా వీఐపీలకు అంతరాలయ దర్శనాలను ఉదయం 6 గంటలకు నిలిపివేసి నీలాద్రి గుమ్మం గేట్లకు తాళాలు వేస్తామని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా రాజగోపురం వద్ద ఉన్న లిఫ్ట్ ద్వారా అనుమతించి నిజరూప దర్శనం కలిపిస్తామన్నారు. క్యూలో ఉండే పిల్లలకు పాలు, బిస్కెట్లు అందిస్తామన్నారు. మధ్యాహ్నం వరకు సింహగిరిపై తాను స్వయంగా ఉండి ఏర్పాట్లను పరిశీలిస్తానన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు శాఖ తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవ ఏర్పాట్లను ఈఓ సుబ్బారావు, ఈఈ డిజి శ్రీనివాసరాజు, సీహెచ్ వెంకటరమణ మంత్రికి వివరించారు. తొలుత మంత్రి, కలెక్టర్, సీపీ, జేసీ మయూర్ అశోక్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా పండితులు వేదాశీర్వచనాలిచ్చారు. ఈఓ శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గంటా రవితేజ, కార్పొరేటర్ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు తరుణ్ ఆదిత్య పాల్గొన్నారు.

వీఐపీల అంతరాలయ దర్శనాలకు అనుమతి ఇవ్వొద్దు

భక్తుల డిమాండ్

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చందనోత్సవంలో వీఐపీలను అంతరాలయ దర్శనాలకు అనుమతించొద్దని భక్తులు కోరుతున్నారు. 2022, 2023లో జరిగిన ఉత్సవాల్లో అధికారులు వీఐపీల అంతరాలయ దర్శనాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 2023లో అప్పటి కలెక్టర్, దేవదాయ శాఖ కమిషనర్, సీపీ స్వయంగా అంతరాలయ ప్రవేశాలను ప్రోత్సహించారు. దీంతో సాధారణ భక్తులు నరకయాతన పడ్డారు. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ, స్వరూపానంద వంటి వారు కూడా దర్శనానికి కొంతసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఈసారి జరిగే ఉత్సవంలో కూడా వీఐపీలకు అంతరాలయ దర్శనం ఉదయం ఆరు గంటల వరకు కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. దీన్ని సాధారణ భక్తులు వ్యతిరేకిస్తున్నారు.ఉత్సవం విజయవంతం కావాలంటే తొలి దర్శనం ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు, తరువాత దేవదాయ శాఖ మంత్రి, పట్టువస్త్రాలు సమర్పించే టీటీడీ అధికార వ్యక్తికి తప్ప ఇతరులకు అంతరాలయ దర్శనాలకు అనుమతించరాదని కోరుతున్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆనందపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గంభీరం పంచాయతీ పరిధిలోని పైడా కళాశాల ఆవరణలో కొలువుదీరిన శరణ్య వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణ ధర్మకర్త పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 29న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 30న ధ్వజారోహనం, స్వామివారి కల్యాణం,1న సుదర్శన, శ్రీమహాలక్ష్మి హోమం, సాయంత్రం శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన జరుగుతుందన్నారు. 2న చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజారోహనం ఉంటాయని తెలిపారు.

ఆరో వార్డు బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

కొమ్మాది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆరో వార్డు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చోడవరపు నాగరాజు, ఉపాధ్యక్షులుగా సుబ్బరాజు, శేషలత, ప్రధాన కార్యదర్శిగా జీఆర్ఎన్ రాజు, కార్యదర్శిగా సీతామహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు ప్రమోద చక్రవర్తి, సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవకాంత్, విశాఖ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం


కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార నాయకులు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు చేపలుప్పాడలో మత్స్యకార నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు తెలుగు యువత నాయకుడు పాసి త్రినాథ్‌కుమార్, జనసేన అధ్యక్షుడు జి. అప్పారావు, బీజేపీ అధ్యక్షుడు వి. కొండ, మత్స్యకార నాయకులు కారి అప్పారావు, మైలపల్లి రాము, చీపుళ్ల శ్రీను, పోతిన అప్పలరాజు,పోతిన సాంబ, శీరపు రమణ, దుంప నరసింహమూర్తి, గజ్జి రాజు, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, సూరాడ రవి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా కూటమి

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భృతిని ప్రభుత్వం రెట్టింపు చేసి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం మత్స్యకార కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పడుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పేరుతో రూ. 300 కోట్లు దుర్వినియోగం చేసి, మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు.

కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీ స్టేడియంలో కరాటే వేసవి శిక్షణ శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, మానసిక స్థైర్యానికి తోడ్పడతాయన్నారు. నిర్వాహకుడు, రెమో లయన్స్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ రెమో యాదవ్ మాట్లాడుతూ జూన్ 8వ తేదీ వరకూ మినీ స్టేడియం, సిడార్ స్కూల్, కోరాడపేట, సంగివలస, తగరపువలస రామకృష్ణా విద్యాలయం, ఆనందపురంలో ఈ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు గొలగాని నరేంద్రకుమార్, ఆదిమూలం నాగరాజు, బోర శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు


వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

కొమ్మాది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలోని ఆర్‌హెచ్ కాలనీలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు టీడీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం 49వ సచివాలయం సిబ్బంది కాలనీలో పర్యటించి, స్థానికుల చిరునామా, ఇళ్ల హద్దులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు సమస్యను విన్నవించడంతో సర్వే చేసి 296 జీఓ కింద 184 మందికి పట్టాలు రిజిస్ట్రేషన్ చేయడానికి అనుమతి ఇచ్చారని చెప్పారు.


కొండ దిగువన తొలిపావంచ వద్ద కోలలకు పూజ చేస్తున్న మత్స్యకారులు


పుష్కరిణి వద్ద భక్తుల సందడి

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి భక్తులతో పోటెత్తింది. గంధం అమావాస్య కావడంతో ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు.వందలాది మంది శనివారం రాత్రే కొండదిగువకు చేరుకున్నారు. వేకువజామున వారంతా పుష్కరిణిలో స్నానాలు చేసి కోలలకు పూజలు చేశారు. కొందరు పుష్కరిణి ఒడ్డున, మరికొందరు సింహగిరి మాడవీధుల్లో రాత్రంతా భజనలు చేస్తూ జాగారం చేశారు. ఆదివారం ఉదయం తిరిగి సింహగిరిపై గంగధారలో స్నానాలు చేసి, అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన దేవస్థానం ఈఓ సుబ్బారావు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయించారు. కాగా భక్తులకు స్వచ్ఛంద సేవకులు పలుచోట్ల అన్నప్రసాదం అందించారు. అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు బంటుబిల్లి మహేశ్ ఆర్థిక సహాయంతో సొసైటీ కార్యాలయం వద్ద సుమారు ఐదు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే పుష్కరిణి సమీపంలో నారాయణ సేవాదళ్ సారథ్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు.


స్వామివారికి నీరాజనం ఇస్తున్న అర్చకుడు

భైరవస్వామికి పూజలు

చైత్రమాస అమావాస్యను పురస్కరించుకుని భైరవస్వామికి వేలాదిమంది భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే సింహాచలం చేరుకుని పుష్కరిణిలో స్నా నాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. అమృత కలశాలను మొక్కుబడిగా సమర్పించి క్షీరాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అలాగే ఆలయ ఆవరణలో సకల గ్రహ దోష నివారణకు గుమ్మడికాయల్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించారు. కాగా ఈ ఆలయానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'అన్యమతస్తులను అనుమతించొద్దు'

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :చందనోత్సవంలో అప్పన్న సేవకు ఇతర మతస్తులను అనుమతించరాదని విశ్వహిందూ పరిషత్ మఠ్ మందిర్ టోలీ పూడిపెద్ది శర్మ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది ఉత్సవంలో వైజాగ్ వలంటీర్స్ సంస్థకు చెందిన వారిలో సెక్యులర్ పేరుతో అన్యమతాలకు చెందిన వారు పని చేసినట్టు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అదే సంస్థకు చెందిన వలంటీర్లకు ఈసారి కూడా అవకాశం ఇవ్వడానికి దేవస్థానానికి చెందిన కార్యనిర్వాహక ఇంజినీరు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అన్యమతస్తులను అనుమతించవద్దని, వాళ్లకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నూకాలమ్మ నెల పండుగ

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూకాలమ్మ నెల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమ దాత దేవరకొండ సూర్యనారాయణ దంపతులను ఆలయ పూజారి చౌదరి సత్యరాజు ఘనంగా సత్కరించారు. సాయంత్రం బీచ్‌రోడ్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య పూజారులు చౌదరి సత్యరాజు, వెంకటేశ్, మారుతి, వేణుబాబు, హరి, ఎర్రయ్యరెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.


పర్యాటకులతో కళకళలాడుతున్న తీరం

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తీవ్రమైన ఎండతో అల్లాడిన ప్రజలు సాయంత్రం సాగర తీరానికి వచ్చి సేదతీరారు. భీమిలి పరిసర ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పర్యాటకులు అధికంగా రావడంతో బీచ్ కళకళలాడింది.



ర్యాలీలో పాల్గొన్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ర్యాలీ

కొమ్మాది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపంద చర్య అని మధురవాడ పౌర సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

5 నుంచి అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు

పద్మనాభం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ మహా సంప్రోక్షణ, శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించాలని ఆలయ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. అనంతుని ఆలయ గోపురం గతంలో పిడుగుపాటుకు దెబ్బతినడంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. శిఖర నిర్మాణం పూర్తికావడంతో ఆదివారం స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ఈఓ నానాజీ బాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నుంచి 9 వరకు శిఖర ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. 5న కుంతీ మాధవస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గిరిపై ఉన్న ఆలయానికి తీసుకువెళ్తామన్నారు. కొన్నేళ్ల తరువాత జరుగుతున్న ఆలయ శిఖర ప్రతిష్ఠను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కె. నగేశ్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరావు, సన్యాసినాయుడు, పద్దు, ఎర్నాయుడు, సన్యాసిరావు, నరసింగరావు, అర్చకులు ఆంజనేయస్వామి, వెంకటాచారి, పవన్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు నెలకు కనీస వేతనం రూ. 25 వేలుకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అప్పన్న దేవస్థానానికి చెందిన కేశఖండన శాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు జి. రాము, కార్యదర్శి ఏవీ నరసింహం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'లయన్స్ సేవలు విస్తృతం కావాలి'

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందుండాలని ఆ క్లబ్ డిస్ట్రిక్టు గవర్నర్ ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని సెంటినియల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కాలుష్య నియంత్రణకు సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణాకాలనీ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండ వెనుకభాగంలో అర్ధరాత్రి వేళలో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతున్నారు. ఒక క్వారీ లారీపై జేసీబీని తీసుకువచ్చి ఈ తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికే చాలావరకు కొండను తవ్వేశారు. కాలనీలోని కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని గమనించి మీడియాకు తెలియజేశారు.

హాస్టల్ విద్యార్థినుల ఇక్కట్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతిగృహానికి ఆకస్మికంగా సెలవులు ప్రకటించడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ వసతి గృహంలో డైట్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినులు ఉంటున్నారు. శనివారం నుంచి హాస్టల్‌కు సెలవులు మూసివేస్తున్నామని వార్డెన్ చెప్పడంతో విద్యార్థినులు అవాక్కయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులకు ఈనెల 23 నుంచి 30 వరకూ 4వ సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు ఎక్కడ గడపాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్, ఎం ఫార్మా పీజీ కోర్సులకు 7 వేల దరఖాస్తులు

... 5వ పేజీ తరువాయి

జియో ఇన్ఫర్మేటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్,మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జీ, నానో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పీజీఈసెట్ నిర్వహిస్తున్నారు. ఎంఫార్మసీ కోర్సుల్లోనూ ప్రవేశాలకు ఇదే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మల్లికార్జునరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇదీ షెడ్యూల్..

ప్రవేశ పరీక్షకు ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు రూ.వెయ్యి, వేయి మే పదో తేదీ నుంచి 15 వరకు రూ2 వేలు, మే 16 నుంచి 20 వరకు రూ.4 వేలు, మే 21 నుంచి 26 వరకు రూ.10 వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 25 నుంచి 27 వరకు తప్పులను సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. మే 31న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ మధ్య పరీక్షలను నిర్వహించనున్నామని, రాష్ట్రంలో 17, హైదరాబాద్‌లోని ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ తెలిపారు.

చర్చిలో బాలిక మృతిపై అనుమానాలు

... 5వ పేజీ తరువాయి

ఉంటోంది. ఈ క్రమంలో కొంతకాలంగా చంద్రికకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ప్రార్థన చేస్తే తగ్గిపోతుందనే భావనతో పలు చర్చిలకు తిప్పుతున్నారు. ఇటీవల కొత్తవలసలోని చర్చికి తీసుకు వెళ్లి ప్రార్థన చేయగా ఫలితం కనిపించకపోవడంతో, ఈనెల 24న జ్ఞానాపురంలోని చర్చికి తీసుకువెళ్లారు. అక్కడ పాస్టర్ వినయ్ ఆమె పేరిట ప్రార్థన చేశారు. అనంతరం తిరిగి వెళ్లకుండా ముగ్గురూ అక్కడే ఉండిపోయారు. తర్వాత వారంతా మరోసారి ప్రార్థన చేస్తుండగా చంద్రిక గట్టిగా అరుస్తూ అక్కడివారిని కరిచేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమె నోట్లో గుడ్డలు కుక్కి, ముఖానికి చున్నీ చుట్టేశారు. అయితే చంద్రిక అచేతనంగా పడివుండడం, ముఖానికి గుడ్డ కట్టివుండడంతో అక్కడివారు చర్చి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ప్రార్థన అయిపోయింది కాబట్టి వెళ్లిపోవాలని వరలక్ష్మి, సావిత్రమ్మను కోరారు. దీంతో చంద్రిక ముఖానికి కట్టిన చున్నీని విప్పిన తల్లి, అమ్మమ్మ ఆమెలో స్పందనలేకపోవడంతో మృతిచెందినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదుచేశారు. అయితే తన కుమార్తె మృతికి భార్య, అత్త కారణమని తండ్రి శ్రీనివాసరావు ఆరోపించడంతో వారిద్దరూ శనివారం రాత్రి శ్రీకాకుళంలోని తమ స్వగ్రామానికి వెళ్లారు. అక్కడ ఇద్దరూ చున్నీని మెడకు బిగించుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బాలిక మృతిపై అనుమానాలు తొలగక ముందే వారిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఈ కేసుపై మరింత దృష్టిసారించారు. బాలికతోపాటు ఆమె తల్లి, అమ్మమ్మ మానసిక పరిస్థితి బాగోలేదని, పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటారని స్థానికులు తెలిపారని పోలీసులు చెబుతున్నారు.



గోతులమయమైన రోడ్డును పరిశీలిస్తున్న భెల్ హెచ్‌పీవీపీ ఈడీ సుబ్రహ్మణ్యం

భెల్ టౌన్‌షిప్ రోడ్డును పరిశీలించిన ఈడీ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో వాహనచోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్న సంస్థ ప్రధాన ద్వారం నుంచి తుంగ్లాం గేటు వరకు గల రోడ్డును ఆదివారం భెల్ హెచ్‌పీవీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం పరిశీలించారు. తుంగ్లాం గ్రామానికి ఆనుకుని ఉన్న కంపెనీ గేటు వద్ద రాళ్లు తేలిపోయి గోతులతో నిండిన రోడ్డును ఆయన తిలకించారు. రోజూ వందలాది మంది కార్మికులతో పాటు తుంగ్లాం పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో ఉన్న గోతుల వల్ల తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తింపు కార్మిక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఈడీకి విజ్ఞప్తి చేశారు.

అనంతరం స్థానిక శ్మశానవాటికను ఆయన పరిశీలించారు. రహదారి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఈడీ కార్మిక నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘ కార్మిక నాయకులు బొండా బాబూరావు, ఎస్.సాహు, ఎ.వెంకటరావు, కొల్లి దేముడు, కె.ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్

అగనంపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీ-హెల్త్ కేర్ సౌజన్యంతో ఆదివారం స్టీల్‌ప్లాంట్ రహదారిలోని నడక మైదానం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. సుమారు రెండు వందల మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొం దారు. శిబిరాన్ని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం వైద్యులు ప్రజలకు వివిధ రకాల టెస్టులు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కాగా నడక మైదానం అభివృద్ధికి రూ.పది వేల విరాళం అందజేసిన టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్రను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. స్థానిక నాయకులు గల్లా రాజు, రుద్రకుమార్, కనకభవానీ, గుడే సుశీలగజేంద్రరావు, డి.రమేశ్, ఎం.వెంకటరావు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడంలో సత్యసాయి భజన మండలి ఇతర సేవా సంఘాలకు ఆదర్శంగా ఉంటుందని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. బీహెచ్‌పీవీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో తుంగ్లాం సత్యసాయి మందిరం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు డి.నందీశ్వరరావు, నావన వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 14, క్యారెట్ 35 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, క్యాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 24, కంద 80, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



వికాస్‌నగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన స్విమ్మింగ్‌పూల్



స్విమ్మింగ్‌పూల్ సమీపంలో దుస్తులు మార్చుకునే గదులు

ప్రారంభానికి సిద్ధమైన స్విమ్మింగ్‌పూల్

త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు జీవీఎంసీ అధికారుల సన్నాహాలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ స్టేడియం ఆవరణలో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో త్వరలోనే దీనిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వికాస్‌నగర్‌లో స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేయాలని 2011లో అప్పటి మేయర్ పులుసు జనార్ధనరావు ప్రతిపాదించారు. అందుకు నాటి పాలకవర్గం కూడా ఆమోదించడంతో రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. రాజీవ్‌గాంధీ స్టేడియం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే కొంత మేర పనులు జరిగాక పలు సాంకేతిక కారణాల వల్ల స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం ఆగిపోయింది. ఆ తరువాత దీని గురించి జీవీఎంసీ అధికారులు, పాలకవర్గం పట్టించుకోలేదు.

ఈ క్రమంలో 2023లో వికాస్‌నగర్‌లో స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించాలని జీవీఎంసీ పాలకవర్గం నిర్ణయించింది. దీనిని రాజీవ్‌గాంధీ స్టేడియం ఎదురుగా అసంపూర్తిగా వదిలేసిన చోట కాకుండా మైదానం లోపల ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం సుమారు రూ.రెండు కోట్లు మంజూరు చేయడంతో పాటు వెంటనే శంకుస్థాపన, నిర్మాణ పనులను ప్రారంభించారు. స్విమ్మింగ్‌పూల్, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, దుస్తులు మార్చుకునే గదులు, స్విమ్మింగ్‌పూల్‌కు నీటి సదుపాయం, చుట్టూ ప్రహరీతో పాటు దానిపై ఆకర్షణీయమైన చిత్రాలను వేయడంతో పాటు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. అంతేకాక స్విమ్మింగ్‌పూల్ చుట్టూ మొక్కలతో గ్రీనరీని ఏర్పాటు చేశారు. ఆధునిక వసతులతో నిర్మితమైన ఈ స్విమ్మింగ్‌పూల్ మరికొద్ది రోజుల్లోనే వినియోగంలోకి కానున్నది.

ఉక్కు పరిరక్షణకు ఉద్యమాలను ఉధృతం చేద్దాం

- కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై పోరాడదాం
- కార్పొరేటర్ బి.గంగారావు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకుగాను మే డే స్ఫూర్తితో మే డే మార్చ్ పేరుతో ర్యాలీని ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో ప్రారంభమైన ఈ ర్యాలీ టౌన్‌షిప్‌లోని పలు సెక్టార్ల మీదుగా మళ్లీ అదే మైదానం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ఉధృతం చేద్దామన్నారు. స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, కేంద్ర విధానాలను నిరసిస్తూ పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే పోరాటాల్లో ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా పాల్గొనవలసిందిగా కోరారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తి పెరుగుతున్నా ఉద్యోగులు, కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేంద్రం ప్యాకేజీ పేరుతో ఉన్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కష్టించి పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టి.చిరంజీవి, ప్రసాద్, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



పరదేశమ్మ విగ్రహావిష్కరణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం సమీప పెదయాతపాలెం డాక్‌యార్డు కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీపరదేశమ్మ విగ్రహావిష్కరణను ఆదివారం ఆదివారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి మోహనస్వామి పర్యవేక్షణలో గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, హోమాలు చేశారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుంపాల పరదేశి, కర్రి ఈశ్వరరావు, మార్పు సత్యన్నారాయణ, తుంపాల శ్రీను, కండిపల్లి అర్జున్, గోవింద్, రాజులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

మల్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5బి 59వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను వార్డు టీడీపీ అధ్యక్షుడు మాత శ్రీను ఆదివారం సరిచేయించారు. స్తంభాలకు తీగలు వేలాడుతూ, ఎప్పుడు తెగిపడతాయోనని భయంగా ఉందని మాత శ్రీను దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే గణబాబుకు సమస్య చెప్పి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడించారు. అనంతరం తీగలు సరిచేయడంతో స్థానికులు ఊరట చెందారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



పెందుర్తిలో అయోధ్య రాముని సెట్టింగ్

పెందుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేకువనే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. అమ్మవారి గాజులు, పూలు, పసుపు, కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. సంబరంలో ఏర్పాటుచేసిన స్టేజీల్లో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతరలో విద్యుద్దీప కాంతులతో అయోధ్య రామసేతు మందిరం, వేంకటేశ్వర స్వామి, దుర్గమ్మ ఆలయాల కటౌట్‌లు ఆకట్టుకున్నాయి. సాముగరడీలు, చిడతలు, భజనలు, పులి వేషాలు, తాటకి, కోలాటం, కేరళ నృత్యాలతో సందడి నెలకొంది. అమ్మవారి ఆలయం నుంచి స్థానిక కూడలి వరకు చేపట్టిన విద్యుత్ దీప అలంకరణ జిగేల్‌మంది. స్థానిక కూడలిలో రాత్రి బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి ఘటాలతో డప్పులు, బాజాభజంత్రీలతో అనుపోత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో పెందుర్తి జనసంద్రమైంది. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ప్రమాదాల నివారణపై మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ సూచించారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆస్పత్రి పాలకవర్గం సామాజిక బాధ్యతలో భాగంగా ప్రమాదాల నివారణ సూచనల బోర్డులను సీఐకి ఆదివారం అందజేశారు. ఆస్పత్రి వారు సమకూర్చిన ఈ బోర్డులను మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రతి కూడలిలో ఏర్పాటు చేస్తామన్నారు. బోర్డులో రాయించిన ప్రతి సూచనను వాహనదారులు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సూచనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి పరిపాలన అధికారి బెస్సీ, మల్కాపురం ట్రాఫిక్ ఎస్సై అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చందనోత్సవ టికెట్ కౌంటర్లు ఏవీ?

పంచగ్రామాల ప్రజల అసంతృప్తి

వేపగుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేపగుంట ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సింహాద్రి అప్పన్న చందనోత్సవ టికెట్ల విక్రయాల కౌంటర్ ఏర్పాటు చేయకపోవటంతో పరిసర ప్రాంత భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సింహాచలం పంచగ్రామాల పరిధిలో ఉన్న వేపగుంటలో కనీసం ఒక్క టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయకపోవటంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీనియర్ సిటిజన్లు, ఇతరులు సింహాచలం కొండ దిగువన ఉన్న యూనియన్, ఎస్‌బీఐ బ్యాంకులకు మరో 4 కి.మీ. వెళ్లాల్సి రావటం, ఎండలు విపరీతంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎప్పుడూ వేపగుంట ఎస్‌బీఐలో, గోపాలపట్నం, గోశాల పెట్రోల్ బంకుల్లో టికెట్లు విక్రయించేవారు. దీంతో అనేకమంది సులభంగా పొందేవారు. టౌన్‌లోని కొన్ని ప్రాంతాలకు ఇచ్చి, దగ్గరలో ఉన్న పంచ గ్రామాల ప్రజలకు అందుబాటులో లేకుండా చేయటం ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికే సింహాచ లం కింద ఉన్న బ్యాంక్‌లో ఆదివారం సాయంత్రం టికెట్లు లేవని బ్యాంక్ సిబ్బంది చెప్పటంతో అనేకమంది నిరాశతో వెనుదిరిగారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవస్థానం పరిధిలో ఉన్న బంక్‌లు, లేదా గోపాలపట్నం, వేపగుంట పరిసర ఎస్‌బీఐ శాఖల్లో టికెట్లు విక్రయించాలని సామాన్య ప్రజానీకం విజ్ఞప్తి చేస్తోంది.

ఉగ్రవాదాన్ని అణచివేయండి

నిరసన ర్యాలీలతో హోరెత్తిన పారిశ్రామిక ప్రాంతం

మల్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అణచివేసి, అందరిలో మానవత్వం నింపాలని కోరుతూ అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ (విశాఖ యూనిట్) ఆధ్వర్యంలో శ్రీహరిపురంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్ నుంచి జీవీఎంసీ మైదానం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మైదానంలో ఉగ్రవాద వ్యతిరేక నినాదాలు చేశారు. ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికుల కుటుంబాలు భారత్ మాతాకు జై అంటూ నినదించారు. కొందరు ఉద్వేగ భరితంగా మాట్లాడారు. కశ్మీర్‌లో హిందువులను కాల్చి చంపిన ఏ ఉగ్రవాదిని వదలకూడదని, ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేయాలని అన్నారు. భారతదేశం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శమైనదన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు.



శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ ప్రతినిధుల నిరసన ర్యాలీ

బీజేపీ ఆధ్వర్యంలో..

ఉగ్రవాదుల దుశ్చర్యకు నిరసనగా జింక్ గేటు నుంచి శ్రీహరిపురం వరకు బీజేపీ పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టింది. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా యువకులంతా మానవ హారంగా ఏర్పడి ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొల్లూరి గురుమూర్తి, సతీష్, హేమరావు, జనసేన నాయకులు శివ, సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గాజువాక ఆంజనేయస్వామి గుడి ఎదురుగా మానవ హారంగా నిలబడిన బీజేపీ నాయకులు, యువకులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బొండా జగన్, లక్కరాజు సోంబాబు, తదితరులు

ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ఆదివారం రాత్రి 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, బీజేపీ కో-కన్వీనర్ లక్కరాజు సోంబాబు ఆధ్వర్యంలో వడ్లపూడిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక ప్రజల ప్రాణాలను తీస్తున్న ఉగ్రమూకలను ఏరివేయాలన్నారు. పాకిస్థాన్ అసమర్థతకు కశ్మీర్ దుర్ఘటన పరాకాష్ఠగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, సిరసపల్లి కనకరాజు, డివి అప్పారావు, మాటూరి రాము, వర్రె రాంబాబు, రాజన్ రాజు, ప్రగడ దానయ్య, కృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన 'ప్రేరణ అసోసియేషన్' ప్రతినిధులు

అగనంపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులను ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందించారు. స్థానిక సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో డిప్యూటీ మేనేజర్ ఉప్పలపాటి లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను సత్కరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 'పది'లో మంచి ఫలితాలను విద్యార్థులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, కేజే నాయుడు, స్థానిక నాయకులు అండిబోయిన మంగరాజు, సత్యనారాయణ, హనుమంతరావు, పైడిరాజు, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

గాజువాక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు తక్కువ వచ్చేలా గృహ వినియోగదారుల కోసం అందుబాటులోకి వచ్చిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఈపీడీసీఎల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏఈలు, సబ్ ఇంజనీర్లు, ఇతర విద్యుత్ సిబ్బందితో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఈ పథకం గురించి వివరిస్తున్నారు. డిజిటల్ విద్యుత్ మీటర్ల వల్ల ఒక్క బల్బు, ఫ్యాన్‌ను వినియోగించే వారికి సైతం బిల్లులు అధికంగా వస్తుండడం, ఆపై వేసవిలో విద్యుత్ బిల్లుల భారం వినియోగదారులపై మరింత అధికంగా ఉంటుండడంతో 'సూర్యఘర్' గురించి ప్రజలను వివరించి వారిని చైతన్యపరుస్తున్నారు. గాజువాక ప్రాంతంలో చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ రమణమూర్తి, సిబ్బంది ఇంటింటికి వెళ్లడమే కాకుండా పలు కాలనీల్లో సమావేశాలను నిర్వహిస్తూ 'సూర్యఘర్' ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీ జనార్దన్

టీడీపీ హయాంలోనే రజకులకు ప్రాధాన్యం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే రజకులకు ప్రాధాన్యత లభిం చిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అన్నారు. ఆదివారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం సమీపంలో ఉత్తరాంధ్ర రజక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రజకులతో పాటు చాలా బీసీ కులాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. రజకులు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని, తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాలాకాలంగా కోరడం సమంజసమేన్నారు. దీనికి కొంత సమయం పడుతుందన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి మాట్లాడుతూ రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చాలన్న దానిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని తెలిపారు. దీనికి కేంద్ర స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో రజకులకు ప్రాధాన్యత కల్పిస్తామని, వృత్తిపరమైన అంశాలకు సంబంధించి పనిముట్లు, దోభీఘాట్ల అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. నగరంలో ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం రజక నాయకులు టీడీ. జనార్దన్, గండి బాబ్జి, ఇతర ముఖ్య నేతలను సన్మానించారు. రజక ఫెడరేషన్ మాజీ చైర్మన్ రాజమండ్రి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రజక జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు గురజాపు రాము, డాక్టర్ దుర్గారావు, మదన్‌మోహన్, వి.మధుసూదనరావు, ప్రకాశం జిల్లా సంఘం నాయకుడు బాలయ్య, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నౌపడ రామారావు, అడ్డూరు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు చెక్కు అందజేస్తున్న రామునాయుడు

పెందుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి పెందుర్తి బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ చేతుల మీదుగా చెక్కును ఆలయ కమిటీకి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, వేగి దివాకర్, వేగి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంతో కొండవాలు ప్రాంతానికి ఊరట



పూర్తయిన వెంకటసాయినగర్ అనుసంధాన రహదారి

వేపగుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట వెంకటసాయినగర్‌ను కలిపే అనుసంధాన రహదారి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ఈ ప్రాంతంలో తరుచూ ఏ కొద్దిపాటి వర్షం పడినా కొండపై నుంచి కాలనీల నుంచి వచ్చే వర్షపునీరు, ఇసుక మేట వేసి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. దీనిపై కాలనీవాసుల నుంచి విజ్ఞప్తులు అందటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలో దాదాపు రూ.36 లక్షలతో కొండపై ఉన్న ఆలయానికి నీరు రాకుండా కాలువ, అప్రోచ్ రోడ్డు తదితర పనులను జీవీఎంసీ నిధులతో ఎట్టకేలకు పూర్తిచేశారు. దీంతో గత దశాబ్దంన్నర పైగా కొండవాలు ప్రాంతంలో ఇబ్బందులు పరిష్కారం కావటంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆసియా పవర్ లిఫ్టింగ్ టోర్నీకి కోటేశ్వరరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆసియా పురుషులు, మహిళల విశ్వవిద్యాలయాల కప్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ టోర్నీకి రిఫరీగా నగరానికి చెందిన



పోస్టల్ శాఖ ఉద్యోగి సకల కోటేశ్వరరావు నియమితులయ్యారు. అంతర్జాతీయ రిఫరీగా గుర్తింపు ఉన్న కోటేశ్వరరావు మే 5 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే ఈ టోర్నీకి రిఫరీగా వ్యవహరిస్తారు. రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధులు, సీనియర్ లిఫ్టర్లు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రాణిస్తున్న రమణయ్య

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సూపర్ సీనియర్స్ బెంగళూరు ఓపెన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన పి.వెంకట రమణయ్య అద్భుతంగా రాణిస్తున్నారు. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో 65 ఏళ్ల పైబడిన వారి విభాగం డబుల్స్‌లో పోరాట పటిమను ప్రదర్శించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. ఆదివారం జరిగిన సింగిల్స్‌లో డిఫెం



డింగ్ చాంపియన్ రుత్ (భువనేశ్వర్) చేతిలో పోరాడి ఓడిన రమణయ్య...డబుల్స్‌లో తమ ప్రత్యర్థులపై 2-1 స్కోరుతో విజయం సాధించారు. ఈ టోర్నీ ముగిసిన తర్వాత జర్మనీలో జరగనున్న వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌కు సన్నద్ధంలో భాగంగా ఢిల్లీలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరవుతారు. రమణయ్యను పలువురు అభినందించారు.

మే 16 నుంచి అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు మే 16 నుంచి 18 వరకు నిర్వహిస్తామని వీడీసీఏ కార్యదర్శి కె.పార్థసారథి తెలిపారు. ఎంపికలలో పాల్గొనేవారు సెప్టెంబరు 1, 2006న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. ఆసక్తిగలవారు మే 7, 8 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలోని వీడీసీఏ కార్యాలయంలో వయసు ధ్రువీకరణ పత్రం చూపించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని షిరిడీ సాయి ధ్యానమందిరం 16వ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రోజంతా వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. సోమ, మంగళవారాలు కూడా బాబాకు పంచామృతాభిషేకాలు, 1008 లడ్డూలతో సహస్ర నామార్చన, మంగళవారం మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుంది. బుధవారం సాయంత్రం మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహిస్తారు.

సంత్ నిరంకారి భక్తుల రక్తదానం

మహారాణిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సద్గురుబాబా గురుబచన్ సింగ్, బాబా ప్రతాప్‌సింగ్‌ల జ్ఞాపకార్థం మానవ ఏకత్వ దివస్ పేరుతో సంత్‌నిరంకారి చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ భవన సముదాయంలో విశాఖ శాఖ అధ్యక్షుడు ప్రేమ్ రామ్‌చంద్ మీర్చురీ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సంత్‌నిరంకారి భక్తులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, రవి, పి.వి.రావు డి.ఎ.రాజు, రాజ్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం ఆప్తాల్మిక్ ఉద్యోగుల డిమాండ్

మహారాణిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారుల సంఘం అధ్యక్షుడు కె.జె. రఘురామరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఏపీఎన్‌జీవో భవన్‌లో జోన్-1 ఆప్తాల్మిక్ అధికారుల సంఘ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత 39 సంవత్సరాలుగా ఎలాంటి పదోన్నతికి నోచుకోకుండా నిరాశ, నిస్పృహలకు లోనవుతూ ఉద్యోగ విరమణ చేస్తున్నామని వాపోయారు. తమ పదోన్నతులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీలను భర్తీ చేసి, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌కే దాసు, కృష్ణారావు, బాలాజీ, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.50 వేల విలువ చేసే పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కేరళకు చెందిన మొయిద్దీన్ నేచియల్ అనే వ్యక్తి గంజాయి రవాణా చేస్తూ దొరికాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

చందనోత్సవం విజయవంతానికి కృషి

- అంతరాలయ దర్శనాలు ఆరు గంటలతో పూర్తి
- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత
- కలెక్టర్‌తో కలిసి సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం విజయవంతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం ఆమె కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారి నిజరూప దర్శనం భక్తులందరికీ కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈఏడాది సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాధారణ భక్తులతో సంబంధం లేకుండా వీఐపీలకు అంతరాలయ దర్శనాలను ఉదయం 6 గంటలకు నిలిపివేసి నీలాద్రి గుమ్మం గేట్లకు తాళాలు వేస్తామని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా రాజగోపురం వద్ద ఉన్న లిఫ్ట్ ద్వారా అనుమతించి నిజరూప దర్శనం కలిపిస్తామన్నారు. క్యూలో ఉండే పిల్లలకు పాలు, బిస్కెట్లు అందిస్తామన్నారు. మధ్యాహ్నం వరకు సింహగిరిపై తాను స్వయంగా ఉండి ఏర్పాట్లను పరిశీలిస్తానన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు శాఖ తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవ ఏర్పాట్లను ఈఓ సుబ్బారావు, ఈఈ డిజి శ్రీనివాసరాజు, సీహెచ్ వెంకటరమణ మంత్రికి వివరించారు. తొలుత మంత్రి, కలెక్టర్, సీపీ, జేసీ మయూర్ అశోక్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా పండితులు వేదాశీర్వచనాలిచ్చారు. ఈఓ శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గంటా రవితేజ, కార్పొరేటర్ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఐటీ డీపీ అధ్యక్షుడు తరుణ్ ఆదిత్య పాల్గొన్నారు.



మంత్రి అనితకు ఏర్పాట్లు గురించి వివరిస్తున్న ఈవో సుబ్బారావు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదిస్తున్న ముస్లింలు



ర్యాలీలో పాల్గొన్న తూర్పుకోస్తారైల్వే మజ్దూర్ సంఘ్ సభ్యులు

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడులను ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, జిల్లా ముస్లిం సమాఖ్య తీవ్రంగా ఖండించాయి. ఆదివారం టీఎస్ఎన్ కాలనీలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సొసైటీ అధ్యక్షుడు హైదరాలి సింకా మాట్లాడుతూ ఉగ్రదాడుల్లో పర్యాటకులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జాతీయ పతాకాలను పట్టుకొని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ముస్లిం సంఘాల నాయకులు మునీర్ ఖాన్, అబ్దుల్ మునీర్, షేక్ అహ్మద్ వల్లీ తదితరులు పాల్గొన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ తూర్పుకోస్తా రైల్వే మజ్దూర్ సంఘ్ ఆదివారం ర్యాలీ నిర్వహించింది. డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు నిరసన నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. మజ్దూర్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఉగ్రవాదంపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని, దాడులు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ర్యాలీలో మజ్దూర్ సంఘ్ నాయకులు జి.బాల మురళీకృష్ణ, ఎంవీఎస్.నాయుడు, లోవారెడ్డి, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే 7 నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవాలు

అల్లిపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవాలు మే 7 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి (ఈవో) జి.వి.రమాబాయి తెలిపారు. మే 7న ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకాలు, స్నపనం, తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, సాయంత్రం ఉత్సవ సంకల్పం చేస్తారు. 8న రాత్రి స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. 10, 11 తేదీల్లో ఉదయం హోమం, 12న వైశాఖ పౌర్ణమి సందర్భంగా శేషహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం,చక్రతీర్థం, ధ్వజారోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతి సమర్పిస్తారు. 13న శ్రీవారి పుష్పాంజలి ఉత్సవం, ఊంజల్ సేవ, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో వివరించారు. వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొనే భక్తులు దేవస్థానంలో రూ.1,116 చెల్లించి రసీదు పొందాలని కోరారు.




ఈఓ రమాబాయి

వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో...

మురళీనగర్: శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మే 8 నుంచి 12 వరకు 23వ ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బి.ప్రసాద్ తెలిపారు. 8న సాయంత్రం 5 గంటలకు శ్రీవారి కల్యాణం జరుగుతుంది. 9న లక్ష మల్లెలతో అర్చన, సదస్యోత్సవం, 10న ఆలయం వద్ద మహా అన్నదానం కార్యక్రమాలు చేపడతారు. 12న ఉత్సవాల్లో ఆఖరిరోజు వేంకటేశ్వరునికి పౌర్ణమి పంచామృతాభిషేకాలు, తిరువీధి నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు శేషాచార్య స్వామి తెలిపారు.

మహాసంఘ్ ఉపాధ్యక్షుడిగా గోపాలకృష్ణ



డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ పోర్ట్, డాక్ మజ్దూర్ మహా సంఘ్ (బీఎంఎస్) ఉపాధ్యక్షుడిగా కేఏఎస్‌వీ గోపాలకృష్ణ పట్నాయక్ ఎన్నికయ్యారు. ఒడిశాలోని పారాదీప్‌లో 11 మంది సభ్యులు గల కొత్త పాలకవర్గ ఎన్నిక నిర్వహించారు. గోపాలకృష్ణ పట్నాయక్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు అధ్యక్షుడు సురేష్ కమలాకర్ పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ పోర్టులోని ట్రాఫిక్ విభాగ రైల్వే కమర్షియల్ సెక్షన్‌లో గూడ్స్ సూపర్‌వైజర్‌గా గోపాలకృష్ణ పట్నాయక్ పనిచేస్తున్నారు. బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, ఏపీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, కోశాధికారి లాలం ప్రసాద్, విశాఖ బీఎంఎస్ అధ్యక్షుడు రొక్కం సురేష్, పోర్టు బీఎంఎస్ గౌరవ అధ్యక్షుడు భవానీ శంకరుడు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

మహారాణిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో పిల్లలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పుస్తక పఠనం అలవరుస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే 15 సంవత్సరాలలోపు విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం నుంచి జూన్ 6 వరకు శిబిరాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో క్విజ్, జనరల్ నాలెడ్జి, పుస్తకాలు చదవటం, అనంతరం సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్: విద్యార్థులకు సోమవారం నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరం జరుగుతుంది. ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విభిన్న అంశాల్లో పిల్లలకు తర్ఫీదు ఇవ్వనున్నట్లు గ్రంథపాలకురాలు (లైబ్రేరియన్) పద్మజ తెలిపారు. పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజికల్ చైర్ ఆటల నుంచి పుస్తకాలు చదివించడం, డాన్స్, క్యారమ్స్ వంటి క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు , చిత్రంలో ఇతర నాయకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకరావులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. ఇవి అమలైతే కార్మికులు సమ్మె, సంఘం ఏర్పాటు, యాజమాన్యంతో జీతభత్యాల ఒప్పంద హక్కులను కోల్పోతారన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో అఖిలపక్ష నాయకులు కుమార్, నాగభూషణం, మన్మథరావు, శ్రీనివాస్, మణి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆస్తులు కొట్టేయడానికే వక్ఫ్ సవరణ చట్టం'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆస్తులు కొట్టేయాలన్న కుట్రతో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చిందని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ విశాఖపట్నం ప్రతినిధి రహమతుల్లా బేగ్ ఆరోపించారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజం కోసం తమ పూర్వీకులు త్యాగం చేసినవే కానీ ప్రభుత్వాని వి కావని స్పష్టం చేశారు. ప్రముఖ న్యాయవాది షరీఫ్ మాట్లాడుతూ ముస్లిం సంక్షేమం కోసం దానం చేసిన ఆస్తి సంరక్షణ సంస్థగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డును ఏర్పాటు చేశారన్నారు. దీని నిర్వహణ బాధ్యతల కోసం స్థానిక ముతవల్లీలు, మ్యానేజింగ్ కమిటీలను నియమించి రాష్ట్ర వక్ఫ్ బోర్డు యంత్రాంగం పర్యవేక్షిస్తుందని వివరించారు.తొలుత పహల్గాం మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు అమతుల్లా ఖాన్, షేరు, బషీర్, షరీఫ్, మునీర్‌ఖాన్, నూర్ అహ్మద్, షేక్‌బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

'తాగి పడిపోవడంతోనే తలకు గాయం'

సీతంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత నెల 12న రాత్రి అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లో ఆవాల నరసింగరావు (38) అనే వ్యక్తి తలకు తీవ్ర గాయమై పడి ఉండటంతో ఎవరో బండ రాయితో కొట్టి హత్య చేయడానికి ప్రయత్నించారని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మద్యం తాగి రాయిపై పడి గాయమైనట్లు ఆ వ్యక్తి తెలిపాడని ఏసీపీ లక్ష్మణమూర్తి ఆదివారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకర్లకు తెలిపారు. స్థానికుల సమాచారంతో సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో అప్పట్లో నరసింగరావు పడి ఉన్న చోటుకు వెళ్లి విచారణ చేపట్టారు. ఘటన స్థలంలో లభించిన ఆనవాళ్ల ప్రకారం హత్యాయత్నంగా కేసు నమోదు చేశారు. గాయం నుంచి కోలుకున్న నరసింగరావు అసలు విషయాన్ని పోలీసులకు తెలిపాడని ఏసీపీ తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మత్స్యకారుల ధన్యవాదాలు

సీతంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార కులాలకు అన్యాయం చేసే జీవో నెంబర్ 217 రద్దు, జీవన భృతి రూ.20 వేలకు పెంపు, ఆయిల్ సబ్సిడీ, వేట పరికరాల పంపిణీ, పలు సంక్షేమ పథకాలు అమలు, మత్స్యకార కులాల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర మత్స్యకార నాయకులు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆదివారం రాష్ట్ర మత్స్యకార ఉపకులాల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మత్స్యకార ఉపకులాల రాజకీయ, ఆర్థిక, ఉపాధి, విద్యా రంగాల్లో పూర్తిస్థాయిలో మద్దతు అందించేందుకు ప్రభుత్వానికి సహకారం కొనసాగించాలని నిర్ణయించామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని, రాబోయే రోజుల్లో 14 మత్స్యకార ఉపకులాలు ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అర్జున్, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకపూడి పాపారావు, పి.జి. అప్పారావు, తెప్పల శాంతారామ్, పలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్జున్

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



ప్రయాణికురాలి సూట్‌కేసును తనిఖీ చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులో జరిగిన ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్పీ బలగాలు చేపట్టిన ముమ్మర తనిఖీలు ఆదివారం కూడా కొనసాగాయి. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌లతోపాటు పరిసర ప్రాంతాల్లో కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫామ్‌లపై భారీగా బలగాలు మోహరించడమే కాకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రయాణికుల లగేజిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చిన రైల్లోకి కూడా ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్రవేశించి అనుమానిత వస్తువులు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు జాగిలాలతో స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేపట్టారు.

రైళ్లలో టికెట్ తనిఖీలు

ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి వీలుగా భద్రత లోపాలు లేకుండా డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదేశాల మేరకు టికెట్ తనిఖీలు చేపట్టినట్లు విశాఖ సహా వాల్తేరు డివిజన్ అంతటా టిక్కెట్ తనిఖీలు చేపట్టినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మహిళలు, దివ్యాంగుల కోచ్‌లలో ఇతరులు ప్రవేశించకుండా నిరోధించామన్నారు. క్యూ పద్ధతిలో ప్రయాణికులు కోచ్‌ల్లో ప్రవేశించేలా పర్యవేక్షిస్తూ, సాధారణ టికెట్ ప్రయాణికులు రిజర్వేషన్ కోచ్‌ల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రయాణికులు తమ లగేజిని జాగ్రత్తగా చూసుకోవాలని, అనుమానస్పద వస్తువులు/వ్యక్తుల సమాచారాన్ని రైల్వే అధికారులకు తెలియచేసి సహకరించాలని సూచించామన్నారు.

పాలీసెట్ విద్యార్థులకు గ్రాండ్ మోడల్ టెస్టు

కంచరపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో పాలీసెట్ గ్రాండ్ మోడల్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలీసెట్ జరగనున్న నేపథ్యంలో ఈ నెల 4 నుంచి కెమికల్ కళాశాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన 200 మంది విద్యార్థులకు మోడల్ గ్రాండ్ టెస్టును ఓఎంఆర్ షీట్స్‌పై నిర్వహించారు. మోడల్ టెస్టును కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పర్యవేక్షించారు. పరీక్ష అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్ష రోజు నిబంధనలు పాటిస్తూ చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించే అంశాలను వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కెమికల్ కళాశాల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

మురళీనగర్, 27 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్ నిర్వహణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం, సాధారణ రుగ్మతల చికిత్సలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మ్యాక్సీ విజన్ సంస్థ వైద్యులు స్వచ్ఛందంగా నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసి మందులు అందించారు. ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, న్యూరాలజీ వైద్యులు యామిని సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి నియంత్రణకు తగు సూచనలు చేశారు. రోజూ 45 నిమిషాల నడక, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. వేసవిలో కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా వేడిమి నుంచి రక్షణ పొందాలన్నారు. 233 మంది శిబిరానికి వచ్చారు. మ్యాక్సీ విజన్ మార్కెటింగ్ మేనేజర్ పి.వి.సతీష్, శ్రీరామ్ తదితరులు సేవలందించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.భానుప్రకాష్, ఆర్.నాగేశ్వరరావు, సి.హెచ్.ప్రసాదరావు వసతులు కల్పించారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు కళకళ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదేశాల మేరకు వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న వార్షిక వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం జరుగుతున్న శిబిరాలలో మెలకువలు నేర్చుకుంటున్నారు. దాదాపు 40 రోజులు సాగే ఈ శిబిరాలలో 5 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు ప్రవేశం కల్పించడంతో క్రీడా ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా మార్గదర్శకంలో జరుగుతున్న యోగా శిబిరంలో చిన్నారులు చురుగ్గా పాల్గొని మానసిక, శారీరక పటిష్టతను పెంపొందించే అంశాలను అభ్యసిస్తున్నారు. రైల్వే ఉద్యోగుల పిల్లలతోపాటు ఇతరులకు అవకాశం కల్పించడంతో వివిధ క్రీడాంశాలలో రైల్వే సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు. ఆసక్తి ఉన్నవారు స్పోర్ట్సు ప్రధాన కార్యదర్శి ఎన్.ఉషను సంప్రదించాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

చర్చిలో బాలిక మృతిపై అనుమానాలు

... 5వ పేజీ తరువాయి

ఉంటోంది. ఈ క్రమంలో కొంతకాలంగా చంద్రికకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ప్రార్థన చేస్తే తగ్గిపోతుందనే భావనతో పలు చర్చిలకు తిప్పుతున్నారు. ఇటీవల కొత్తవలసలోని చర్చికి తీసుకు వెళ్లి ప్రార్థన చేయగా ఫలితం కనిపించకపోవడంతో, ఈనెల 24న జ్ఞానాపురంలోని చర్చికి తీసుకువెళ్లారు. అక్కడ పాస్టర్ వినయ్ ఆమె పేరిట ప్రార్థన చేశారు. అనంతరం తిరిగి వెళ్లకుండా ముగ్గురూ అక్కడే ఉండిపోయారు. తర్వాత వారంతా మరోసారి ప్రార్థన చేస్తుండగా చంద్రిక గట్టిగా అరుస్తూ అక్కడివారిని కరిచేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమె నోట్లో గుడ్డలు కుక్కి, ముఖానికి చున్నీ చుట్టేశారు. అయితే చంద్రిక అచేతనంగా పడివుండడం, ముఖానికి గుడ్డ కట్టివుండడంతో అక్కడివారు చర్చి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ప్రార్థన అయిపోయింది కాబట్టి వెళ్లిపోవాలని వరలక్ష్మి, సావిత్రమ్మను కోరారు. దీంతో చంద్రిక ముఖానికి కట్టిన చున్నీని విప్పిన తల్లి, అమ్మమ్మ ఆమెలో స్పందనలేకపోవడంతో మృతిచెందినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదుచేశారు. అయితే తన కుమార్తె మృతికి భార్య, అత్త కారణమని తండ్రి శ్రీనివాసరావు ఆరోపించడంతో వారిద్దరూ శనివారం రాత్రి శ్రీకాకుళంలోని తమ స్వగ్రామానికి వెళ్లారు. అక్కడ ఇద్దరూ చున్నీని మెడకు బిగించుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బాలిక మృతిపై అనుమానాలు తొలగకముందే వారిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఈ కేసుపై మరింత దృష్టిసారించారు. బాలికతోపాటు ఆమె తల్లి, అమ్మమ్మ మానసిక పరిస్థితి బాగోలేదని, పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటారని స్థానికులు తెలిపారని పోలీసులు చెబుతున్నారు.

ఇంజనీరింగ్, ఎం ఫార్మా పీజీ కోర్సులకు 7 వేల దరఖాస్తులు

... 5వ పేజీ తరువాయి

జియో ఇన్ఫర్మేటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జీ, నానో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పీజీఈసెట్ నిర్వహిస్తున్నారు. ఎం ఫార్మసీ కోర్సుల్లోనూ ప్రవేశాలకు ఇదే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జునరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇదీ షెడ్యూల్..

ప్రవేశ పరీక్షకు ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీక రించనున్నారు. మే ఒకటో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు రూ.వెయ్యి, వేయి మే పదో తేదీ నుంచి 15 వరకు రూ.2 వేలు, మే 16 నుంచి 20 వరకు రూ.4 వేలు, మే 21 నుంచి 26 వరకు రూ.10 వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 25 నుంచి 27 వరకు తప్పుల ను సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. మే 31న విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ మధ్య పరీక్షలను నిర్వ హించనున్నామని, రాష్ట్రంలో 17, హైదరాబాద్‌లోని ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ తెలిపారు.

భూ సమీకరణలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

పేరిట అక్రమాలు సాగాయి. వాస్తవంగా వీరికి భూములు లేకపోయినా బినామీలుగా జాబితాలో చోటు సంపాదించారు. పెందుర్తి తహసీల్దారు కార్యాలయం కేంద్రంగా రికార్డులు మార్చేశారు. ఇదిలా ఉండగా జెర్రిపోతులపాలెం భూ సమీకరణపై జరుగుతున్న విచారణను పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భీమిలి ఎమ్మెల్యే గంటాను కలిసిన పీలా శ్రీనివాసరావు



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌ను కలిసిన పీలా శ్రీనివాసరావు

సిరిపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ మేయర్ ఎన్నిక సోమవారం జరగనున్న నేపథ్యంలో వీరిద్దరూ కొంతసేపు చర్చించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌లుగా కొనసాగిన గొలగాని హరివెంకటకుమారి, జియ్యాని శ్రీధర్‌లపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో తదుపరి రాజకీయ పరిణామాల గురించి మాట్లాడుకున్నట్టు తెలిసింది.

జూకు రూ.3 లక్షల ఆదాయం

ఆరిలోవ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ జూకు సందర్శకులు పోటెత్తారు. జూకు 3,834 మంది సందర్శకులు విచ్చేశారు. వీరి నుంచి సుమారు రూ.3 లక్షల 8 వేల 130 రూపాయలు ఆదాయం సమకూరినట్టు జ్యూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

వాల్తేరు రైల్వే అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ విభాగాల మహిళల, పురుషుల అథ్లెటిక్స్ మీట్ శనివారం ప్రారంభమైంది. రైల్వే ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలకు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష ముఖ్య అతిథిగా హాజరై పరుగు పోటీలను ప్రారంభించారు.

మేడేను సెలవు దినంగా ప్రకటించాలి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :ప్రపంచ కార్మిక దినోత్సవంగా పేర్కొనే మేడేను సెలవు దినంగా ప్రకటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 1886, మే 1 కార్మికులకు ఎనిమిది గంటలు పని విధానం అమలు చేయాలని అమెరికా దేశం చికాగో నగరంలో శ్రమజీవులైన కార్మికులు మహా ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనపై నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ చక్రవర్తి కార్మికులపై తుపాకీ గుళ్లు కురిపించారని, అందులో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు కృషి ఫలితంగా 8 గంటల పని విధానాలు అమలు అయ్యాయన్నారు. ఆ కార్మికుల త్యాగ ఫలితంగా, వారి స్మృత్యర్థం అమలు చేస్తున్న మేడే రోజు సెలవు రోజుగా పరిగణించాలని కోరారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :**వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 35 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 24, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడిఅల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

గోతుల దారుల్లో గమ్యం చేరేదెలా?

- ఎంవీపీ కాలనీ 10వ సెక్టర్‌లో అధ్వానంగా రోడ్లు
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం, రోడ్డు ప్రమాదాలు



రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి



రహదారి మధ్యలో ఏర్పడిన గుంత

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ పదో సెక్టరులో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడే రహదారుల మధ్యలో గోతులు ఏర్పడడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో గోతులు పూడ్చినా, పనుల్లో నాణ్యత కొరవడడం వల్ల మళ్లీ అదే స్థానంలో గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు సజావుగా వెళ్ల లేని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో రద్దీ వేళల్లో ట్రాఫిక్ జామ్ కావడం, ఈ గోతులను తప్పించే ప్రయత్నంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేకుండా పోతోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఓ కార్పొరేట్ పాఠశాలకు వచ్చే వాహనాలతో రద్దీ ఉంటుంది. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటోంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ముఖ్యమైన ఈ ప్రాంతంలో రహదారులపై గోతుల పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ హయాంలోనే రజకులకు ప్రాధాన్యం

పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీ జనార్దన్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ హయాంలోనే రజకులకు ప్రాధాన్యత లభిం చిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అన్నారు. ఆదివారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం సమీపంలో ఉత్తరాంధ్ర రజక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రజకులతో పాటు చాలా బీసీ కులాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. రజకులు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని, తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాలాకాలంగా కోరడం సమంజసమేన్నారు. దీనికి కొంత సమయం పడుతుందన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి మాట్లాడుతూ రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చాలన్న దానిపై సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని తెలిపారు. దీనికి కేంద్ర స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో రజకులకు ప్రాధాన్యత కల్పిస్తామని, వృత్తిపరమైన అంశాలకు సంబంధించి పనిముట్లు, దోబీఘాట్ల అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. నగ రంలో ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం రజక నాయకులు టీడీ. జనార్దన్, గండి బాబ్జి, ఇతర ముఖ్య నేతలను సన్మానించారు.రజక ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రజక జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు గురజాపు రాము, డాక్టర్ దుర్గారావు, సముద్రం మదన్ మోహన్, వి. మధుసూదనరావు, ప్రకాశం జిల్లా రజక సంఘం నాయకుడు బాలయ్య, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నౌపడ రామారావు, అడ్డూరు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తోటగరువు జడ్పీ పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి చినగదిలి మండలానికి సంబంధించిన అన్ని స్కూళ్లకు సరఫరా చేయాల్సిన పాఠ్య పుస్తకాలు ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరాయి. ఈ పుస్తకాలను 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామృత కిట్లు' అనే పేరుతో ముద్రించారు. ఈ పుస్తకాల స్టూడెంట్ కిట్ కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి తొలి విడతగా 31 వేల 560 పాఠ్య పుస్తకాలు చేరినట్టు తెలిపారు, ఇంకా 34 వేల పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఎంవో దేముడుబాబు, చినగదిలి మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ రవీంద్ర బాబు, పి.అనూరాధతో పాటు సీఆర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

అన్నదానం



వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కాలనీలో వేంచేసి యున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బుగత సత్యనారాయణ, కాళ్ల నరసింగరావు, ఆర్.నరేంద్ర, కె.మహేష్, ఆలయ అర్చకులు వెంకటాచార్యులు,గొలగాని త్రినాథ్, బోను శ్రీను, కర్రి గౌరీ పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఫుట్‌పాత్‌లు

- పలకలు విరిగిపోవడంతో పాదచారుల అవస్థలు
- ప్రమాదాలకు గురై గాయాల పాలువుతున్న వాకర్లు



13వ వార్డులోని సర్వీసు రోడ్డులో ఫుట్‌పాత్‌ల పరిస్థితి

ఆరిలోవ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై నడుస్తున్నపుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా అంతే సంగతులు. ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే. ఎందుకంటే ఎక్కడికక్కడే విరిగిపోయి ఫుట్‌పాత్‌లు పాదచారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. జీవీఎంసీ 13వ వార్డులో గల సర్వీసు రోడ్డునకు ఆనుకొని ఉన్న ఫుట్ పాత్ వద్ద మ్యాన్ హోల్స్ పూర్తిగా విరిగి ఉన్నాయి. దీన్ని గమనించకుండా ఎవరైనా ముందుకు అడుగు వేస్తే ప్రమాదంలో పడినట్టే.

ఈ మార్గంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికులు మార్నింగ్, ఈవెనింగ్ వాక్‌కు ఈ మార్గాన్నే ఉపయోగిస్తుంటారు. దీంతో రోజూ చాలామంది ఈ ఫుట్‌పాత్‌ల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు.

అలాగే స్థానిక దీనదయాళ్‌పురంలో ఫుట్‌పాత్‌లపై గల పలకలు చాలా రోజుల నుంచి క్రితమే పూర్తిగా విరిగిపోయాయి. వీటిని మార్చడం లేదు. దీంతో సమస్యగా మారింది. ఈ ఫుట్‌పాత్ పై నుంచి నడిచే వారంతా ఇబ్బందికి గురవుతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారాకి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, పాదచారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉక్కు పరిరక్షణకు ఉద్యమాలను ఉధృతం చేద్దాం

- కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై పోరాడదాం
- కార్పొరేటర్ బి.గంగారావు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు గాను మే డే స్ఫూర్తితో మే డే మార్చ్ పేరుతో ర్యాలీని ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో ప్రారంభమైన ఈ ర్యాలీ టౌన్‌షిప్‌లోని పలు సెక్టార్ల మీదుగా మళ్లీ అదే మైదానం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ఉధృతం చేద్దామన్నారు. స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, కేంద్ర విధానాలను నిరసిస్తూ పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే పోరాటాల్లో ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా పాల్గొనవలసిందిగా కోరారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తి పెరుగుతున్నా ఉద్యోగులు,కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. కేంద్రం ప్యాకేజీ పేరుతో ఉన్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కష్టించి పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమ న్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టి.చిరంజీవి, ప్రసాద్, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఒడిశా గవర్నర్ హరిబాబు



ఒడిశా గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూను ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఆదివారం ఉదయం సందర్శించారు. ఆయనకు ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం ఏయూ ఉపకులపతి కార్యాలయంలో గవర్నర్ భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఏయూ ప్రగతి భవిష్యత్ ప్రణాళికలను గవర్నర్‌కు వీసీ రాజశేఖర్ వివరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటు, విశ్వవిద్యాలయ అవసరాలకు సరిపోయే విధంగా సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా ఒడిశా గవర్నర్ డాక్టర్ కె.హరిబాబును ఏయూ తరఫున వీసీ రాజశేఖర్ సత్కరించారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే రెహమాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెహమాన్, సీపీఐ ఇతర నేతలు

ఆరిలోవ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరంలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరగబోయే 17వ యువజన సమాఖ్య జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే. రెహమాన్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో పలువురు సీపీఐ నేతలతో కలిసిన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. వేలాది మంది యువతీ యువకులు తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయని తెలిపారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయ, మతతత్వ విధానాలనాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో ఈ మహాసభల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సందీప్, కాచుబాబు, లక్ష్మణరావు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భానునగర్ వాసుల సన్మానం

- పార్కులో కబ్జాకు గురైన స్థలం అప్పగించినందుకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న భానునగర్ మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, వెంటనే కబ్జాను తొలగించి పార్కు స్థలాన్ని తమకు అప్పగించాలని భానునగర్ అసోసియేషన్ నివాసుల పోరాటానికి ఫలితం లభించింది. ఎట్టకేలకు శనివారం పార్కు స్థలంలోని కబ్జాను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసు పహారా మధ్య స్థలంలోని కబ్జాను దాదాపు తొలగించి వేశారు. దీనికి సహకరించిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు కాలనీ వాసులు ఆదివారం సాయంత్రం కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. కాలనీలో ఇంకా మిగిలి ఉన్న సుమారు 130 గజాల్లో ఆక్రమణ బిల్డింగ్‌ను కూడా తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరగా, లీగల్ సలహాతో చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మేయర్ ఎలక్షన్ అయిన అనంతరం పార్కు అభివృద్ధిపై దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి, కాలనీ వాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా ఇతర కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్యామలసీతారాం స్వామికి నాట్యశిరోమణి అవార్డు ప్రదానం



శ్యామలసీతారాం స్వామికి అవార్డుతో సత్కరిస్తున్న 'వాడ' నిర్వాహకులు



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ (వాడ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ డాన్స్ డే ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా 'వాడ' నిర్వాహకులు అందించే నాట్య శిరోమణి అవార్డును ముఖ్య అతిథులు సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, డాక్టర్ శ్రీధర్ బిత్తర చేతుల మీదుగా ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి టేకుమల్ల శ్యామల సీతారాంస్వామికి ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం 300 మంది చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కూచిపూడి, భరతనాట్యాలతో మంత్రముగ్ధులను చేశారు. నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్ర ప్రధాన కార్యదర్శి ఏఎంఎస్ శ్రీనివాస్, 'వాడ' ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి గోపీనాథ్, కార్యదర్శి కన్నం వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, శరకం సత్యారావు, బోర యర్రాజీరెడ్డి, ఇతర సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు



రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన మమూరి ఫంక్షన్ హాలు కూడలి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు తీసి వేస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై శనివారం పెను ప్రమాదం తప్పింది. కొండ ప్రాంతం నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని మెయిన్ రోడ్డులో వెళ్తున్న ఆటో ఢీకొంది. అయితే ఇరు వాహనదారులు కాస్త నెమ్మదిగా వస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో ఇక్కడ మమూరి ఫంక్షన్ హాలు వద్ద ఒక స్పీడ్ బ్రేకర్ ఉండేది. రోడ్డు పునర్నిర్మాణంలో స్పీడ్ బ్రేకర్‌ను తొలగించేశారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. రాత్రిపూట కొండప్రాంతం నుంచి వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఒక పెద్ద వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు ప్రాణాలను కోల్పోయాడు. ఆ తరువాత వెంటనే ఇక్కడ స్పీడ్ బ్రేకర్‌ను వేశారు. అయితే రోడ్డు పునర్నిర్మాణ సమయంలో స్పీడ్‌బ్రేకర్ లేకుండా పోయింది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.